
ప్రజాశక్తి

ఆదివారం 20 అక్టోబర్ 2024 5 విజయనగరం





కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు, కార్యకర్తలు

గుర్లలో డయేరియాతో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.25 లక్షలు చొప్పున పరిహారం చెల్లించి, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిపిఎం ఆధ్వర్యాన శనివారం విజయనగరం, బొబ్బిలిలో ఆందోళన చేపట్టారు. బొబ్బిలి ఆర్‌టిసి కాంప్లెక్సు కూడలిలో జరిగిన నిరసనలో సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడారు.

(పూర్తి వివరాలు.. మెయిన్‌లో)

దారుణం

- బెంచీలపై రోగులకు వైద్యసేవలా?
- ప్రభుత్వ తీరుపై మాజీమంత్రి సీదిరి అప్పలరాజు ఆగ్రహం

ప్రజాశక్తి-గుర్ల

డయేరియా రోగుల పట్ల ప్రభుత్వం తీరు దారుణంగా ఉందని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. రోగులను బెంచీలపై పడుకోబెట్టి సిలైన్ బాటిళ్లను కర్రలకుకట్టి ఎక్కించడం విచారకరమని విమర్శించారు. టిడిపి ప్రభుత్వం వైద్యరంగాన్ని నిర్వీర్యం చేసిందని అన్నారు. శనివారం వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్న డయేరియా రోగులను మాజీమంత్రి అప్పలరాజు, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పరామర్శించారు. వారికి అందుతున్న వైద్య సేవలపై ఆడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న డిఎంహెచ్‌ఒ భాస్కరరావుతో మాట్లాడి రోగులకు అందుతున్న వైద్య సేవల పట్ల అసహనం వ్యక్తం చేశారు. అంతరం ఆయన మీడియాతో మాట్లడుతూ గ్రామంలో 8 మృతి చెందితే ప్రభుత్వం లో ఏమాత్రం చలనం లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. రోగులకు మంచాలు కేటాయించలేని స్థితిలో రాష్ట్రం ప్రభుత్వం ఉందా అని ప్రశించారు. వైసిపి ప్రభుత్వంలో నాడు-నేడు కార్యక్రమంలో హైస్కూల్‌కు ఏర్పాటు చేసిన బెంచీలపై రోగులకు వైద్యం అందించడం విచారకరమన్నారు. ఈ విషయం నేషనల్ మీడియాలో వస్తే రాష్ట్రానికి తీవ్ర అవమానమని అన్నారు. ఇప్పటికైనా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి స్పందించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మద్యం మత్తు, ఇసుక మాఫియాల నుండి బయటకు వచ్చి ప్రజారోగ్యంపై దృష్టి సారించాలన్నారు. వైద్యులు వైద్య సేవలు అందిస్తున్నా, శాఖల మధ్య సమన్వయ లోపం కనిపిస్తుందన్నారు. డయేరియాతో మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు.



రోగితో మాట్లాడుతున్న మాజీమంత్రి సీదిరి అప్పలరాజు

బెంచీలే బెడ్లు

- ఒఆర్ఎస్ ప్యాకెట్లూ కరువే
- వైద్య శిబిరంలో డయేరియా రోగులకు అడుగడుగునా అవస్థలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి/గుర్ల

స్కూల్ పిల్లల బెంచీలే బెడ్‌లు... తాగునీరు... అంతకు మించితే మందు బిల్లలు మినహా అంతకు మించిన సదుపాయాలు గుర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో కనిపించడం లేదంటే అతిశయోక్తి కాదు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి రోజూ డయేరియా రోగులు వెళ్తున్నారు. కాస్త నయం అయినవారు ఇళ్లకు చేరుకుంటున్నారు. ఇలా ఇళ్లకు వెళ్లినవారిలో కొంతమంది మృత్యువాత పడ్డారు. కొత్తగా డయేరియాకు గురైన వారు శిబిరంలో చేరుతున్నారు. ఈనేపథ్యంలో ఇప్పటికీ గుర్ల గ్రామం భయం గుప్పెట్లోనే ఉంది. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారి కర్ఫ్యూను తలపిస్తోంది. ఇతర ప్రాంతాలకు రాకపోకలూ తగ్గిపోయాయి. ఈ నేపథ్యంలో రోగులకు మెరుగైన చికిత్స, ఇతర సదుపాయాలు కల్పించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి డయేరియాపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని చెబుతున్నారు. రోగులకు మెరుగైన చికిత్స, సదుపాయాలు కల్పించేందుకు మాత్రం చొరవ తీసుకోవడం లేదు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయడం పట్ల గొప్పగా చెప్పుకుంటున్నప్పటికీ, అక్కడ రోగులకు కనీసం పడకలు కూడా ఏర్పాటు చేయలేదు. స్కూల్ పిల్లలు కూర్చొనే బెంచీలపైనే పడుకుండబెట్టి సిలైన్ బాటిళ్లకు కనీసం స్టాండ్లు కూడాలేక కర్రలకు కట్టి రోగులకు ఎక్కిస్తున్నారు. దీంతో, పక్కకు దొర్లేందుకు కూడా అవకాశం లేకపోతోందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంటల కొద్దీ బెంచీలపై పడుకోవడంతో విపరీతమైన నొప్పితో ఇబ్బంది పడాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శిబిరంలో సిలైన్స్, మందు బిల్లలు మినహా రోగులకు ఒఆర్ఎస్ వంటి ద్రావణాలేవీ ఇవ్వడం లేదని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.



పాఠశాలలో బెంచీలపై వైద్యం పొందుతున్న రోగులు

రోగులకు ఎమ్‌పి పరామర్శ

గుర్ల : డయేరియా నివారణకు అన్ని శాఖల సమన్వయంతో చర్యలు తీసుకున్నామని ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. వైద్య శిబిరంలో చికిత్సపొందుతున్న రోగులను ఆయన పరామర్శించారు. గ్రౌండ్ వాటర్ కలుషితం కావడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు తెలిపారు. సమగ్ర నివేదిక వచ్చిన తరువాత అన్ని విషయాలు వెల్లడిస్తామన్నారు. వ్యాధి ప్రబలడానికి గల కారణాలను పరిశీలించి, మిగతా గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాత్రిపగలూ వైద్య సేవలు అందిస్తున్న సిబ్బందిని అభినందించారు.

డయేరియా నివారణకు కట్టుదిట్టమైన చర్యలు

ప్రతిపక్షాల దుష్ప్రచారం తగదు : మంత్రి కొండపల్లి

ప్రజాశక్తి-విజయనగరంకోట

గుర్ల మండల కేంద్రంలో డయేరియాతో ఒక్కరే మృతి చెందారని, మృతుల సంఖ్యపై దుష్ప్రచారం తగదని రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గుర్ల డయేరియాపై ప్రతిపక్ష పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని అన్నారు. కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌తో కలిసి మంత్రి శ్రీనివాస్ కలెక్టరేట్‌లో శనివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. డయేరియాను అరికట్టడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించారు. గుర్ల గ్రామంలో ఈనెల 14న డయేరియా వ్యాధిని గుర్తించగానే ప్రభుత్వం అప్రమత్తమై, కట్టుదిట్టమైన చర్యలు తీసుకుందని మంత్రి తెలిపారు. వెంటనే వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడంతోపాటు జిల్లా పంచాయతీ అధికారి, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఇ, డిఎంహెచ్‌ఒను అక్కడికి పంపించి డయేరియా వ్యాధి ప్రభలడానికి కారణాలను తెలుసుకున్నామన్నారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించడంతోపాటు, గ్రామానికి చీపురుపల్లి నుంచి తాగునీటిని తెప్పించి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేశామన్నారు. డయేరియా లక్షణాలు సుమారు 201 మందిలో కనిపించగా, వెంటనే చికిత్సను అందించామని, ప్రస్తుతం 40 మంది మాత్రమే స్వల్ప లక్షణాలతో చికిత్స పొందుతున్నారని వివరించారు. వీరిని ఆదివారం ఉదయం ఇంటికి పంపించేస్తామని తెలిపారు. గ్రామంలో భూగర్భ జలాలు కలుషితం కావడం వల్లే వ్యాధి వ్యాప్తి చెందిందని ప్రాథమికంగా గుర్తించామని చెప్పారు. దీంతో గ్రామంలో ఉన్న 277 బోర్ల నీటి వాడకాన్ని నిలిపివేశామని, కొన్ని బోర్లకు విద్యుత్ సరఫరాను కూడా నిలిపివేశామని చెప్పారు. సుమారు 27 బోర్లు నీరు కలుషితం అయ్యిందని గుర్తించామని, వీటిని సూపర్ క్లోరినేషన్ చేశామని తెలిపారు. గుర్ల గ్రామంలో సంభవించిన మరణాలకే డయేరియా కారణం కాదని మంత్రి తెలిపారు. మొత్తం 8 మంది మరణించినట్లు తెలిసిందని, అయితే వీరిలో కేవలం ఒక్కరు మాత్రమే డయేరియా చికిత్స పొంది, డిశ్చార్జి అయిన తరువాత మరణించారని, మిగిలిన మరణాలకు ఇతర అనారోగ్యమే కారణమని మంత్రి అన్నారు. కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ, జిల్లా యంత్రాంగం సకాలంలో తీసుకున్న చర్యల ఫలితంగా కొద్దిరోజుల్లోనే డయేరియా పూర్తిగా అదుపులోకి వచ్చిందని అన్నారు. వ్యాధి బయటపడిన వెంటనే గ్రామస్తులకు అందుబాటులో ఉంటుందన్న ఉద్దేశంతో గ్రామంలోనే యుద్ధప్రాతిపదికన వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి, చికిత్స ప్రారంభించామని చెప్పారు. ముందు జాగ్రత్త చర్యగా చుట్టుప్రక్కల 15 గ్రామాల్లో కూడా వైద్యశిబిరాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు.



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజారోగ్యాన్ని గాలికొదిలేశారు

ఎంతమంది చనిపోతే వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి పరామర్శకు వస్తారు : జెడ్‌పి చైర్మన్ మజ్జి, మాజీ మంత్రి రాజన్నదొర

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

టిడిపి ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని పూర్తిగా గాలికొదిలేసిందని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, మాజీ మంత్రి పి.రాజన్నదొర విమర్శించారు. ఇంకా ఎంతమంది డయేరియాతో చనిపోతే రాష్ట్ర వైద్య ఆరోగ్య మంత్రి పరామర్శకు వస్తారని ప్రశ్నించారు. డయేరియాతో మృతి చెందిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం జెడ్‌పి ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బుధవారం నుంచి శనివారం 11 మంది గుర్లలో చనిపోయినా ప్రభుత్వ పెద్దల్లో చలనం లేకపోవడం బాధాకరమన్నారు. పాచిపెంట మండలంలో కూడా డయేరియా కారణంగా ఇద్దరు చనిపోయారని తెలిపారు. డయేరియా భారిన పడి ప్రజలు మరణిస్తుంటే మెరుగైన వైద్య సేవలు అందించకుండా కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేసిందని అన్నారు. రోగులను ఆస్పత్రులకు తరలించకుండా పాఠశాలలో బల్లలపై పడుకోబెట్టి కర్రలకు సెలైన్ బాటిళ్ల కట్టి ఎక్కిస్తున్నారంటే ప్రజారోగ్యం పట్ల పాలకులకు, అధికారులకు ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందన్నారు. కనీసం బెడ్‌లు ఏర్పాటు చెయ్యలేరా అని ప్రశ్నించారు. ఇంతమంది చనిపోతే కనీసం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి పరామర్శకు రాకపోవడం దారుణమని అన్నారు. మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చట్ట విరుద్ధంగా చేపట్టే ఉపాధి పనులను అడ్డుకుంటాం

చట్టవిరుద్ధంగా చేపట్టే ఉపాధి పనులను అడ్డుకుంటామని నాయకులు తెలిపారు. కూటమి ప్రభుత్వం చట్టవిరుద్ధంగా పనులు చేపట్టి ఉపాధి నిధులను దోచేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. గత ప్రభుత్వంలో గ్రామ సర్పంచ్ పరిధిలో తీర్మానం చేసి పనులు చేపట్టారన్నారు. నేడు అలా కాకుండా ఎంపిడిఒ పరిధిలో పనులు కాంట్రాక్టుకు ఇచ్చి చట్ట విరుద్ధంగా పనులు చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అవసరమైతే న్యాయ పోరాటానికి వెళ్తామని హెచ్చరించారు. విలేకర్ల సమావేశంలో వైసిపి నాయకులు జై హింద్ కుమార్ పాల్గొన్నారు.

డయేరియా అదుపునకు చర్యలు చేపట్టాలి

విజయనగరం టౌన్ : గుర్ల గ్రామంలో ప్రబలిన డయేరియాను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ప్రజా ఆరోగ్య వేదిక జిల్లా కన్వీనర్ ఎస్.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. వ్యాధికి కారకమైన కలుషిత మైన నీరు, పారిశుధ్యాన్ని మెరుగు పరచాలని కోరారు. ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రతపై తగిన అవగాహన కల్పించాలని, గ్రామంలో మురుగు నీరు నిల్వ లేకుండా, చెత్త చెదారం పేరుకు పోకుండా తగు చర్యలు చేపట్టాలని కోరారు. ఇతర గ్రామాలకు, మండలాలకు వ్యాధి ప్రభలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమే : ఆప్

ప్రజాశక్తి-గుర్ల

శాస్త్ర,సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన ఈ ఆధునిక యుగంలో కూడా డయేరియా మరణాలు చోటు చేసుకోవడం విచారకరమని ఆప్ రాష్ట్ర కన్వీనర్ శీర రమేష్, జిల్లా కన్వీనర్ డాక్టర్ పైల రమేష్‌రాజు అన్నారు. డయేరియా మరణాలు కూటమి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. శనివారం డయేరియా బాధితులను ఆప్ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడుతూ ఎప్పుడో 50 ఏళ్ల క్రితం మందులు అందుబాటులో లేని రోజుల్లో డయేరియా మరణాలు సంభవించడం సహజమని, ఈ ఆధునిక ప్రపంచంలో కూడా డయేరియా మరణాలు సంభవించడం చూస్తుంటే ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమైందని పేర్కొన్నారు. ఇప్పటికే 8 మంది ప్రాణాలు కోల్పోయారని,ఇంకా 300 మందికి పైగా ఆ వ్యాధి బారిన పడడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. డయేరియా మరణాలకు కూటమి ప్రభుత్వం బాధ్యత వహించి, మృతుల కుటుంబాలకు 30 లక్షల రూపాయలు చొప్పున ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ పార్టీ నాయకులు శనపతి ఈశ్వరరావు,తిప్పాన కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'సిబిఎం' కరస్పాండెంట్‌పై వేటు

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలోని సిబిఎం పాఠశాల స్థలం బదలాయింపు చేయడంతో ఆ పాఠశాల కరస్పాండెంట్ ఎం.రత్నకుమార్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. విద్యా శాఖ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల స్థలాన్ని బదలాయిస్తూ పది నెలల క్రితం చీపురుపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ జరిగింది. భూబదలాయింపులో అవకతవకలు జరిగినట్లు గుర్తించడంతో కరస్పాండెంట్ పదవి నుంచి రత్నకుమార్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కరస్పాండెంట్‌పై చర్యలు తీసుకోవడంతో వామపక్షాలు, ప్రజాసంఘాల నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ రద్దు చేసి, పాఠశాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు.

నేడు కెజిబివి దరఖాస్తుదారుల సర్టిఫికెట్ల పరిశీలన


ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కెజిబివిల్లో టీచింగ్, నాన్-టీచింగ్ (అకౌంటెంట్, వార్డెన్ పోస్టులకు మాత్రమే) పోస్టులకు దరఖాస్తు చేసిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఆదివారం జరుగుతుందని డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారవు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, సంబంధిత నకలు కాపీలు, ఆన్‌లైన్ అప్లికేషన్ ఫారం జిరాక్స్ కాపీలతో దాసన్నపేటలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఉదయం 9.30 గంటలకు హాజరు కావాలని తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనానికి సంతకాల సేకరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరం లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన శనివారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి రాము, సి హెచ్ వెంకటేశ్ మాట్లాడుతూ 2019లో ఎస్ఎఫ్ఐ ఆందోళన ఫలితంగా ఏర్పాటు చేసిన ఈ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ప్రభుత్వం కనీస సౌకర్యాలు కల్పించడం లేదని అన్నారు. నాలుగేళ్లయినా కళాశాలకు సొంత భవనం కేటాయించకపోవడం ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అని తెలిపారు. దాదాపుగా ఈ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 400 మంది విద్యార్థులు వివిధ కోర్సులలో విద్యను అభ్యసిస్తున్నారని, గదులు చాలక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యార్థులందరికీ సరిపడా తరగతి గదిలు లేకపోవడంతో ఒక పూట మాత్రమే క్లాసులు నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం స్పందించి సొంత భవనాన్ని నిర్మాణం చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఎర్రమ్మ, రాహుల్ ,సూరిబాబు , మురళి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల నుంచి సంతకాలు సేకరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మద్యం షాపునకు వ్యతిరేకంగా కొనసాగుతున్న నిరసన



బొబ్బిలి మార్కెట్లో మద్యం షాపు ఎదుట బైఠాయించిన మహిళలు

ప్రజాశక్తి-బొబ్బిలి

మార్కెట్లో మద్యం షాపు ఏర్పాటుకు వ్యతిరేకంగా స్థానికులు నిరసన కొనసాగిస్తున్నారు. జనావాసాల, నిత్యం రద్దీగా ఉండే మార్కెట్లో మద్యం షాపు ఏర్పాటు చేయవద్దని మూడు రోజులుగా స్థానికులు నిరసన తెలుపుతున్నారు. మద్యం షాపు ముందు శనివారం మహిళలు బైఠాయించారు. మార్కెట్లో మద్యం షాపు పెట్టడంతో మహిళలు, బాలికలు, ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం షాపు వేరే చోటుకు తరలించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని మహిళలు హెచ్చరించారు.

ఎమ్మెల్యేకు వినతి

మార్కెట్లో ఏర్పాటు చేసిన మద్యం షాపును వేరే ప్రాంతానికి తరలించాలని ఎమ్మెల్యే బేబినాయనకు మహిళలు వినతిపత్రం అందజేశారు. కోటలో శనివారం సాయంత్రం ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. జనావాసాల మధ్య మద్యం షాపు వద్దని కోరారు. ఎక్సైజ్ అధికారులతో చర్చించి సమస్య పరిష్కరిస్తామని బేబినాయన హామీ ఇచ్చారు.

నిబంధనలకు విరుద్ధంగా మద్యం షాపు

వేపాడ : మండలంలోని వల్లంపూడిలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం షాపు ఏర్పాటుచేశారు. ఆలయానికి ఎదురుగా, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల పక్కనే ఉన్నా అవేవీ పట్టించుకోకుండా మద్యం షాపు ప్రారంభించారు. మద్యం దుకాణం ఏర్పాటుపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. అధికారులు స్పందించి నిబంధనలకు వ్యతిరేకంగా ఏర్పాటుచేసిన మద్యంషాపును తొలగించాలని కోరుతున్నారు.



వేపాడ.. వల్లంపూడిలో ఆలయం ఎదుట ఏర్పాటుచేసిన మద్యం దుకాణం

డయేరియా మరణం ఒక్కటేనట!

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పంచ పాండవులు ఎంతమంది? అంటే మంచం కోళ్ల మదిరిగా ముగ్గురే అంటూ రెండు చూపుడు వేళ్లు చూపించి ఒక్కరే అని చెప్పాడట వెనుకటి ఓ వ్యక్తి. గుర్ల మండలంలోని డయేరియా మరణాలపై సర్కారు వారి లెక్క ఈ సామెతకు అద్దం పడుతోందని పబ్లిక్ టాక్. ఒక్క గుర్ల మండలంలోనే గడిచిన వారం రోజుల్లో 8 మంది చనిపోయారు. కోట గంద్రేడులో కూడా మరో మహిళ డయేరియాతోనే మృతి చెందింది. ఈ లెక్కన డయేరియాతో ఎనిమిది మంది చనిపోగా, ఒక్క గుర్ల గ్రామంలోనే ఏడుగురు చనిపోయినట్టు లెక్క. ఈ నేపథ్యంలో మెరుగైన వైద్యసేవలపై దృష్టి సారించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు నానా తంటాలు పడుతోంది. మృతుల సంఖ్యను తగ్గించి చెప్పడానికి, ఇందుకోసం వయస్సులు తారుమారు చేయడానికి, వృద్ధులని, ఇతర అనారోగ్య కారణాలతో చనిపోయారని చెప్పడంపైనే ఎక్కువ దృష్టిసారించారని జనం చెప్పుకుంటున్నారు. ఇందుకు తగ్గట్టే శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ డయేరియా మరణాలపై లెక్కలు చెప్పారు. డయేరియాతో కేవలం ఒకే ఒక్కరు చనిపోయారని చెప్పుకొచ్చారు. ఈ సమాచారం జిల్లాలో దావణంలా పాకడంతో జనం ఒకింత ఆశ్చర్యంగా చర్చించు కుంటున్నారు. ఆ గ్రామంలో చనిపోయిన వారిలో ఒకరు మితిమీరిన మద్యం సేవించి, మరొకరు దీర్ఘకాలిక రోగంతో చనిపోయారని, మిగిలిన వారు డయేరియాతోనే చనిపోయారని, మరణించినవారిలో కొందరు గ్రామంలో ఏర్పాటు చేసిన శిబిరంలోనూ చికిత్స పొందారని గ్రామస్తులు చెబుతున్నారు. కోట గంద్రేడులో చనిపోయిన అప్పలనరసయ్యమ్మతో కలిపి మొత్తం 8మంది డయేరియా చనిపోయినట్టు ఆయా గ్రామాల ప్రజానీకం చెబుతున్నారు. రాజు తలచుకుంటే కొరడా దెబ్బలకు కొదవలేదన్నట్టు డయేరియా మరణాల సంఖ్యను దాచేయడం బాధాకరణమని జనం చర్చించుకుంటున్నారు. ఇక అధికారుల లెక్క ప్రకారం.... గుర్లలో ఒకే ఒక్క డయేరియా మరణం అనుకుంటే పైన పేర్కొన్న ప్రకారం డయేరియా లక్షణాలతో ఆరుగురు, ఇతర కారణాలతో ఇద్దరు చొప్పున గత వారం రోజుల్లో మొత్తం గుర్లలో 8మంది మరణాలు సంభించినట్టు లెక్క. ఇవన్నీ సాధారణ మరణాలు అనుకున్నా ఒకే గ్రామంలో ఇంత స్వల్ప వ్యవధిలో ఇన్ని మరణాలు ఊహించుకుంటే భయం పుడుతుంది. ఇందుకు కూడా ప్రభుత్వం బాధ్యత వహించాల్సివుంది. కానీ, అధికార యంత్రాంగం కేవలం డయేరియాకే బాధ్యత వహిస్తున్నట్టు లెక్కలు చెబుతుండడం పట్ల జనం విస్తుపోతున్నారు.



జాతీయ అథ్లెటిక్స్ పోటీలో జిల్లా క్రీడాకారులకు పతకాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గుంటూరులో జరుగుతున్న సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు సాధించి సత్తా చాటారు. అండర్ 18 విభాగంలో బి.హరీష్ 5వేల మీటర్లు రెస్‌వాక్‌లో రెండో స్థానం సాధించి సిల్వర్ మెడల్ సాధించాడు. అండర్ 20 విభాగంలో ఎం.హరీష్ 5వేల మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం, 3వేల మీటర్లు పరుగు పందెంలో బంగారు పతకం సాధించాడు.



పతకాలతో క్రీడాకారులు

డ్వాక్రా బజారును సందర్శించిన మంత్రి

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలోని లోయర్ ట్యాంక్ బండ్ రోడ్డులో ఏర్పాటుచేసిన అఖిలభారత డ్వాక్రా బజార్‌ను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శనివారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల ప్రతినిధులు ఏర్పాటుచేసిన స్టాళ్లను సందర్శించి, డ్వాక్రా సంఘాల సభ్యులతో వారి ఉత్పత్తులపై మాట్లాడారు. కొబ్బరి, జ్యూట్, కలంకారి ఉత్పత్తుల గురించి ఆయా స్టాల్ల నిర్వాహకులతో మాట్లాడి వాటి తయారీ విధానం, మార్కెటింగ్ తదితర అంశాలపై తెలుసుకున్నారు. మంత్రి వెంట డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ కళ్యాణ్ చక్రవర్తి ఉన్నారు.

త్రోబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక విజ్జీ స్టేడియంలో శనివారం స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో జరిగిన అండర్ 14,17 ఎంపిక పోటీలను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలకు విద్యార్థులు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్రీడల ద్వారా మంచి భవిష్యత్ ఉందన్నారు. క్రీడలు ఆడటం ద్వారా శారీరకంగా, మానసికంగా ధృఢంగా ఉండటంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందన్నారు. నేటి సెల్ ఫోన్ యుగంలో స్నేహ సంబంధాలు మరింత మెరుగుపడేందుకు క్రీడలు దోహద పడతా యన్నారు. రాష్ట్ర పోటీల్లో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకొని రావాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ కార్యదర్శి కష్ణంరాజు, చిన్నారి, బంగారాజు, లక్ష్మణ్, రమేష్ మరియు మూడు జిల్లాల వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అండర్ 14 క్రికెట్ జట్టు ఎంపిక పూర్తి

విజ్జి స్టేడియంలో శనివారం జరిగిన అండర్ 14 క్రికెట్ జట్టు ఎంపిక పూర్తయ్యింది. జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం జట్టును ఎంపిక చేయడం జరిగింది.ఎంపిక కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ కార్యదర్శి కృష్ణంరాజు, వ్యాయామ ఉపాధ్యాయుల విద్యార్థులు పాల్గొన్నారు.



పోటీల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ రఘురాజు



బొబ్బిలి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో సౌకర్యాలపై ఆరాతీస్తున్న జడ్జి అరుణశ్రీ

వసతిగృహాల్లో న్యాయమూర్తుల తనిఖీలు

ప్రజాశక్తి-బొబ్బిలి

విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చూడాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ కోరారు. స్థానిక అంధుల, గురుకుల, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలను శనివారం సందర్శించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఇబ్బందులు పడకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. నాణ్యమైన భోజనాలు పెట్టాలని ఆదేశించారు.

శృంగవరపుకోట : పట్టణంలోని వసతిగృహాలను జూనియర్ సివిల్ జడ్జి సబ్బవరపు వాణి శనివారం తనిఖీ చేశారు. వసతిగృహాల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు.

భోజన పథకం అమలు పరిశీలన

విజయనగరం : జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి కె.విజయ కళ్యాణి గత రెండు రోజులుగా నగరంలోగల ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును, పాఠశాలలో ఉన్న వంట గదులను, స్టోర్ రూములను, ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు ఆహారం మెనూ ప్రకారం అమలు అవుతున్నదా లేదా అని పరిశీలించారు. పాఠశాలల్లో వంట గదులు అపరిశుభ్రంగా ఉన్నట్టు గుర్తించారు, స్టోర్ రూములు గాని, డైనింగ్ రూములు గాని లేవని ఈ సందర్భంగా హెచ్ఎంలు తెలిపారు. వంటగదిలను పరిశుభ్రంగా ఉంచాలని ఆయాలను, వంట పని వారిని హెచ్చరించారు,

ఎల్‌పిజి దహనవాటిక ఏర్పాటు

విజయనగరం టౌన్ : నగరంలోని తోటపాలెం రోటరీ మున్సిపల్ శ్మశాన వాటికలో ఎల్‌పిజి దహనం వాటికను శనివారం ఏర్పాటు చేశారు. కోల్ ఇండియా వారి సిఎస్ఆర్ ప్రాజెక్టును స్మార్ట్ ఆంధ్రప్రదేశ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దీన్ని ఏర్పాటు చేసినట్లు రోటరీ సెంట్రల్ క్లబ్ కార్యదర్శి శంకర్ రెడ్డి తెలిపారు. తొలిసారిగా విజయ నగరంలో ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయని కైలాష్ భూమి ఛైర్మన్ టిఎల్ఎన్ మూర్తి చెప్పారు.

రాష్ట్ర స్థాయికి 'సర్వేపల్లి' విద్యార్థులు ఎంపిక

శృంగవరపుకోట : స్థానిక సర్వేపల్లి పాఠశాలకు చెందిన విద్యార్థులు చదరంగం రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17లో పి.సూరజ్‌కుమార్, అండర్-14లో ఎస్.వేదశ్రీ రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ సిహెచ్.సన్యాసిరావు తెలిపారు. క్రీడాకారులను కరస్పాండెంట్‌తోపాటు డైరెక్టర్లు వై.వెంకట్రావు, వి.సుశీల అభినందించారు.

ఉచిత బస్సు ప్రయాణమెప్పుడు?

ప్రజాశక్తి-బొబ్బిలి

టిడిపి సూపర్‌సిక్స్ హామీల్లోని ఉచిత బస్సు ప్రయాణం ఎప్పటి నుంచి ప్రారంభిస్తారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షులు ఎం.పద్మావతి కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం బొబ్బిలి ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద మహిళలతో ఆమె మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమంటూ హామీనిచ్చి, కూటమి అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా ఇంతవరకూ నిర్ణయం తీసుకోలేదని ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణాలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే అమలు చేశారని గుర్తుచేశారు. కర్ణాటక రాష్ట్రంలో కూడా అమలు చేశారని చెప్పారు. మన రాష్ట్రంలో ఎందుకు ఎన్నికల హామీ అమల్లో తాత్సారం చేస్తున్నారని ప్రశ్నించారు. తక్షణమే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా కార్యకర్తలు శ్రీలక్ష్మి, పార్వతి, మంగతాయారు, సుధ, రాణి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

వేపాడ : మండలంలోని పెద్దకృష్ణరాజపురంలో ప్రభుత్వ పాఠశాలలను ఎంఇఒలు జి.జగదీశ్వరరావు, పి.బాల భాస్కరరావు శనివారం సందర్శించారు. తరగతి గదులు, మరుగుదొడ్లు, వంట గదులు, పాఠశాలల ఆవరణ పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులతో తెలుగు, ఇంగ్లీషు చదివించడం, రాయించడంతోపాటు చతుర్విధ ప్రక్రియలు చేయించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

26 నుంచి టిడిపి సభ్యత్వ నమోదు : అశోక్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఈ నెల 26 నుంచి చేపట్టే పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్ గజపతిరాజు కోరారు. టిడిపి సభ్యత్వ నమోదు శిక్షణపై చర్చించేందుకు శనివారం స్థానిక అశోక్ బంగ్లాలో విజయనగరం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయనతోపాటు ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడారు. సభ్యత్వ నమోదులో లక్ష్యాన్ని చేరుకునేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని టిడిపి నాయకులు, కార్పొరేటర్లు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాలను చేరుకోవాలి

నెల్లిమర్ల : విద్యార్థులు భవిష్యత్తు లక్ష్యాలను చేరుకోవాలని ఎస్ఐ బి.గణేష్ అన్నారు. శనివారం ఆయన సతివాడ జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు భవిష్యత్తు లక్ష్యాలు, కెరీర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్య ద్వారా లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. వృత్తి పరమైన నైపుణ్యం సంపాదించుకోవాలని తెలిపారు. వ్యవసాయం అనేది వ్యక్తి గతంగా పెరుగుదలకు ఉపయోగపడుతుందని, తలిదండ్రుల మార్గదర్శకాలతో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

శృంగవరపుకోట : మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సిఐ వి.రమణమూర్తి అన్నారు. సంకల్పం కార్యక్రమాన్ని పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులకు డ్రగ్స్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. అనంతరం డ్రగ్స్ ఫిర్యాదుల పెట్టెను కళాశాలలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు భాస్కరరావు, గంగరాజు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దబ్బిరాజుపేటలో 'పొలం పిలుస్తోంది'

వేపాడ : మండలంలోని దబ్బిరాజుపేట గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మట్టి నమూనాలు సేకరించారు. సుడోమోనస్‌తో వరి విత్తనాలను శుద్ధి చేశారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తయారుచేసిన పత్ర కషాయాన్ని రైతులకు పంపిణీ చేశారు. వ్యవసాయ అధికారి యశ్వంత్‌రావు ఆధ్వర్యంలో వరి పంటకు స్ప్రేయింగ్ చేయించారు. కార్యక్రమంలో విఎఎ దేముడు, ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి వెంకటరావు, ఐసిఆర్‌పిఎస్ హరీష్, మహేష్ పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

విధులకు డుమ్మా

- అంతా వారిష్టం... అడిగే వారే లేరు
- సచివాలయ సిబ్బంది తీరు

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువ చేయాలనే ఉద్దేశరో గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. అయితే, అందులో పనిచేస్తున్న ఉద్యోగులు మాత్రం విధులకు డుమ్మా కొట్టడం, సకాలంలో సచివాలయాలకు రాకపోవడం, అంతా మా ఇష్టం అన్నట్లు వ్యవహరించడం గమనార్హం. 'ప్రజాశక్తి' పరిశీలనలో ఈ విషయాలన్నీ బయటపడ్డాయి. శుక్రవారం పిరిడి, కమ్మవలస, శివడవలస, శనివారం జగన్నాథపురం, కోమటిపల్లి, కలవరాయి, చింతాడ గ్రామాల్లోని సచివాలయాలను 'ప్రజాశక్తి' పరిశీలించగా, ఎక్కడా పూర్తి స్థాయిలో సిబ్బంది 11.30 గంటల వరకు కార్యాలయాలకు రాని పరిస్థితి కనిపించింది. గతంలో అంటే వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి ప్రజలకు చేరువగా ఉండేవారు. ఇప్పుడు వాలంటీర్లు లేకపోవడం, ఉన్న సచివాలయ సిబ్బంది కూడా సకాలంలో విధులకు హాజరు కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. డిజిటల్ అసిస్టెంట్, ఎఎన్ఎం, వ్యవసాయ కార్యదర్శి మినహా ఇతర ఉద్యోగులు తమ ఇష్టానుసారం సమయపాలన లేకుండా వ్యవహరిస్తున్నారు. మండలంలోని 19 సచివాలయాల్లో దాదాపు అన్నిచోట్లా సిబ్బందిది ఇదే తీరు. దీనిపై హాజరైన ఉద్యోగులను అడిగితే పొంతన లేని సమాధానాలు చెబుతుండటం గమనార్హం.



సచివాలయంలో సిబ్బంది లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

అవగాహనతోనే గైర్హాజరు

మండలంలోని పిరిడి, కారాడ, అలజంగి-2, తదితర సచివాలయాల్లో సిబ్బంది కొరత వేధిస్తోంది. కొన్ని సచివాలయాల్లో 11 మంది సిబ్బంది, కొన్ని చోట్ల 10 మంది, 8 మంది ఇలా పని చేస్తున్నారు. ఆయా సచివాలయాల్లో సిబ్బంది ఒకరు ఈరోజు గైర్హాజరైతే, మరుసటి రోజు మరొకరు గైర్హాజరు విశేషం. సిబ్బంది మధ్య అవగాహనతో విధులకు డుమ్మా కొడుతున్నారు.



వెంటాడుతున్న సిబ్బంది కొరత

సచివాలయ ఉద్యోగులు ఇటీవల బదిలీలపై వచ్చారు. సమయపాలన విషయమై సోమవారం సమావేశంలో సిబ్బందికి తెలియజేస్తాను. సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవు.

- రవికుమార్, ఎంపిడిఒ

జిల్లా స్థాయి పోటీలకు ముగ్గురు ఎంపిక

ప్రజాశక్తి-గజపతినగరం

స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.దారరాజు, టి. శ్రీనివాసరావు శనివారం తెలిపారు. బొండపల్లి మండలం దేవుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 18వ తేదీ న జరిగిన నియోజకవర్గస్థాయి అండర్ -14 అండర్ -17 కబడ్డీ, వాలీబాల్ పోటీల జట్ల ఎంపిక నిర్వహించగా, అండర్ -14 కబడ్డీ జట్టుకు ఎనిమిదో తరగతి చదువుతున్న ఎం. ధనుశ్రీ, అండర్ -17 కబడ్డీ జట్టుకు తొమ్మిదో తరగతి చదువుతున్న బి. జాహ్నవి ఎంపికైనట్లు తెలిపారు. అండర్ 14 వాలీబాల్ నియోజకవర్గం జట్టుకు ఎనిమిదో తరగతి చదువుతున్న జే. అంకిత ఎంపికైందన్నారు . ఈనెల 21వ తేదీన డెంకాడ మండలం రఘు మండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరగనున్న అండర్ 14, అండర్ 17 కబడ్డీ జిల్లా స్థాయి పోటీలకు గజపతినగరం నియోజకవర్గ జట్టు తరుపున వీరు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ రమేష్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

హోం కంపోస్టింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి- రాజాం

పట్టణంలో మహిళలకు హోమ్ కంపోస్టింగ్‌పై మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కంపోస్ట్ అనేది మొక్కల ఎరువుగా, నేల భౌతిక, రసాయన, జీవ లక్షణాలను మెరుగుపరచడానికి ఉపయోగించే మిశ్రమ పదార్థమన్నారు. ఇళ్లలో ఉండే తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి కేవలం పొడి చెత్తను మాత్రమే చెత్త బండికి ఇచ్చేలా, తడి చెత్తను వారి వారి ఇళ్లల్లోనే కంపోస్టింగ్ ఎరువులు ఎలా తయారు చేసుకోవాలో తెలిపారు. పట్టణాన్ని శుభ్రంగా ఉంచుకునే బాధ్యత మనపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ చేగొండి ప్రసాద్, అసిస్టెంట్ ఇంజనీర్ భాగ్యలక్ష్మి, సానిటరీ సూపర్‌వైజర్లు నాయుడు, జయరాజు సానిటరీ సెక్రటరీలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ ఆకస్మిక తనిఖీలు

అపరిశుభ్రతపై ఆగ్రహం

ప్రజాశక్తి-గజపతినగరం

ఎంపిడిఒ బి.కళ్యాణి శుక్రవారం మండలంలోని పురిటిపెంట గ్రామ సచివాలయం తోపాటు హాస్టల్, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పురిటిపెంట పంచాయతీ పరిధిలో చాలాచోట్ల పరిసరాల అపరిశుభ్రత పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కళాశాల విద్యార్థినుల వసతి గృహాన్ని సందర్శించి అక్కడి మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ఆహార పదార్థాల నాణ్యత, మెనూ ప్రకారం విద్యార్థునులకు పదార్థాలను అందించక పోవడంపై హాస్టల్ ఉద్యోగులను ప్రశ్నించారు. హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల మధ్యాహ్న భోజన పథకం వంటకాలను తనిఖీ చేసి రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని, రక్షిత మంచినీటి పథకం ట్యాంకులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పురిటిపెంట గ్రామంలోని శానిటేషన్ పరిస్థితి అధ్వానంగా ఉందని దీనిని మెరుగుపరచాలని, కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగించి శుభ్రం చేయాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది ఉన్నారు



వసతిగృహంలో వంటలను పరిశీలిస్తున్న ఎంపిడిఒ కళ్యాణి

45 రోజుల్లో భూ సమస్యలు పరిష్కారం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-మెంటాడ

రీ సర్వే చేపట్టిన రెవెన్యూ గ్రామాల్లో వచ్చిన భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు బొబ్బిలి ఆర్‌డి రామ్మోహనరావు తెలిపారు. శనివారం మండలంలోని ఉద్దంగి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన చిన్నచిన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని, జటిలమైనవాటిపి 45 రోజుల్లోగా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఎల్‌పిఎన్‌లను సరి చేసుకుంటే భవిష్యత్తులో భూసమస్యలు ఉండవని చెప్పారు. ప్రత్యేకంగా వాటిని సరిచేసే ప్రయత్నంలో రెవెన్యూ సిబ్బంది ఉన్నట్లు చెప్పారు. ఆన్‌లైన్‌లో పేర్లు, సర్వే నంబర్లు, విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు తదితర సమస్యలపై అర్జీలు అధికంగా వస్తున్నాయని తెలిపారు. రెవెన్యూ పరమైన ఏ సమస్య ఉన్నా రైతులు తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని తహశీల్దార్ కె.శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె.శ్రీనివాసరావు, ఉప తహశీల్దార్ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని నీలకంఠరాజపురం గ్రామంలో తహశీల్దార్ రాములమ్మ అధ్యక్షతన గ్రామసభ ఏర్పాటు చేశారు. 17 మంది నుంచి వినతులు అందాయి. కార్యక్రమంలో సర్పంచ్ గొటివాడ దేవి, ఎంపిటిసి వి.వి.చినరాము నాయుడు, మాజీ ఎంపిటిసి వి.జగ్గుబాబు, ఉప సర్పంచ్ కండిపల్లి పెదనాయుడు, విఆర్‌ఒ తాతారావు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి : భూ రీసర్వే సమస్యలు తక్షణమే పరిష్కారానికి కృషి చేస్తామని తహశీల్దార్ ఎల్లారావు అన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డిఒ రామ్మోహనరావు

మండలంలోని ఉప్పర నాయుడు వలసలో భూ రీసర్వే సమస్యలపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తేవాలని సూచించారు. పాస్ పుస్తకాలు రానివారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 15 రకాల భూ రీ సమస్యలపై దరఖాస్తులు అందినట్లు వెల్లడించారు. వీరితోపాటు సర్వేయర్ శ్రీనివాసరావు, ఆర్ఐ రేవతి, డిటి చిన్నారావు, విఆర్‌ఒ రామకృష్ణ ఉన్నారు.

విజేతలకు 'సెంచూరియన్' అభినందనలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఇటీవల జాతీయ, రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో గెలిపొందిన విజేతలకు సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ డి.ఎన్.రావు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో క్రీడాకారులు మరిన్ని పతకాలను సాధించాలని ఆకాంక్షించారు. క్రీడలు చదువులో ఒక భాగంగా ఉండాలన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు విశ్వవిద్యాలయం తరపున జాతీయ స్థాయి విజేతకు రూ.75 వేలు, రాష్ట్ర స్థాయి విజేతలకు రూ.50వేలు నగదు పారితోషికాన్ని అందజేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు మాట్లాడుతూ వెయిట్ లిఫ్టింగ్ విజేతలకు సెంచూరియన్ ఒక హబ్‌గా మారిందన్నారు. అనంతరం జాతీయస్థాయిలో బంగారు పతకం సాధించిన చుక్క శ్రీలక్ష్మిని అభినందిస్తూ రూ.5వేలు నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ డైరెక్టర్, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ, ఐక్యూఎసి హెడ్, డీన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, డీన్ సన్నీడియోల్, డీన్ విజయ్‌బాబు, ప్రొఫెసర్ శాంతమ్మ, డీన్ పుష్పలత, బిబిఎ విభాగాధిపతి మోహన్‌బాబు, స్పోర్ట్స్ అసిస్టెంట్ డైరెక్టర్ డి.నారాయణరావు పాల్గొన్నారు.

జానపద కళలను కాపాడుకుందాం

ప్రజాశక్తి-విజయనగరం కోట

అతి ప్రాచీన కళారూపాలైన తోలుబొమ్మలాట, జముకుల పాట, తూర్పు భాగవతం వంటి జానపద కళలను కాపాడుకోవాలని గిడుగు రామ్మూర్తి తెలుగు భాష, జానపద కళా పీఠం వ్యవస్థాపకులు బద్రి కూర్మారావు అన్నారు. పైడితల్లమ్మ పండగలో ప్రదర్శితమైన కాకినాడకు చెందిన తోలుబొమ్మలాట కళాకారులైన తోట పవన్ కుమార్ బృందాన్ని కలిసి మాట్లాడారు. అంతరించిపోతున్న కళలను ఆదరించకపోతే ఈ కళారూపం కనుమరుగయ్యే ప్రమాదం ఉందని అన్నారు. కళాకారుడు తోట పవన్ కుమార్ మాట్లాడుతూ మూడు తరాలుగా ఈ కళా రూపాన్ని పైడితల్లమ్మ పండగలో ప్రదర్శిస్తున్నామని ప్రస్తుత తరం వారిని కూడా ఈ కళలో శిక్షణ ఇస్తున్నామని, ప్రభుత్వం ఈ కళాకారులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం తోలుబొమ్మలాట కళాకారులందరినీ బద్రి కూర్మారావు సత్కరించారు

గ్రామాల అభివృద్ధికే పల్లెపండగ

ప్రజాశక్తి-పూసపాటిరేగ

గ్రామాల్లో అభివృద్ధి పండగలు ప్రారంభమయ్యాయని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. శనివారం మండంలోని చోడమ్మ అగ్రహారం, పూసపాటిరేగ, చల్లవానితోట, రెల్లివలస గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. గ్రామాల్లో అవసరమైన పనులు ప్రారంభించి సంక్రాంతిలోపే పూర్తి చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మహంతి శివ, కిలారి సూరిబాబు, గుడివాడ జమరాజు, పతివాడ శ్రీను, ఇజ్జురోతు ఈశ్వరరావు, బాలా అప్పలరాజు, జనసేన మండల అధ్యక్షులు జలపారి శివ తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : మండలంలోని వేములాపల్లి, గోపాలపల్లి, చామలాపల్లి, పోతనాపల్లి, సంతగైరమ్మపేట, కొత్తూరు గ్రామాలలో 60 లక్షల రూపాయలతో సిసి రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలకు ఎంపిపి సండి సోమేశ్వరావు, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ నాయకులు వబ్బిన సన్యాసినాయుడు, సర్పంచులు సూర్యనారాయణ, ఆడారి ఉమామహేశ్వరరావు, సూర్యారావు, సీతారాంపురం ఎంపిటిసి సన్యాసప్పడు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని ఆతవ, ఎఎస్‌పేట, జగ్గయ్యపేట, సింగరాయి, అరిగిపాలెం, బల్లంకి గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధి హామీ నిధులు సుమారు 90 లక్షలతో రోడ్లు, కాలువల పనులకు శంకుస్థాపనలు చేశారు. ఇఒపిఆర్‌డి వరప్రసాద్, సర్పంచులు ఎన్.వెంకటరావు, వంటాకు రామయ్యమ్మ, ఎంపిటిసి గొంప తులసి, ఉప సర్పంచులు వంటాకు శ్రీను, పల్లె ధనుంజయ, మాజీ సర్పంచ్ ఎం.అప్పలసూరి, టిడిపి నాయకులు సిరికి రమణ, తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : మండలంలోని ఒమ్మిలో పల్లె పండగ వారోత్సవాలు శనివారం జనసేన నాయకులు అంబళ్ల అప్పలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. జన సేన సీనియర్ నాయకులు చనమల్ల వెంకట రమణ పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ (పల్లె పండగ వారోత్సవాలు సందర్భంగా ఆయా గ్రామాల్లో సిసి రహదార్లు, పక్కా రోడ్లు వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో దన్నాన రామమూర్తి, రెడ్డి సత్యం తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుల బాయ్‌కాట్

పూసపాటిరేగ : ఎన్నికలు అనంతరం ఎమ్మెల్యే లోకం నాగమాధవికి, నియోజకవర్గం టిడిపి నేతలకు మధ్య విబేదాలున్నాయన్న సంగతి తెలిసిందే. అయితే అది ముసిరి ముసిరి గాలివానలా మారుతోంది. పూసపాటిరేగ మండలంలో అది కాస్తా ముదిరి పాకానపడింది. పలు గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమాలు జరిగినా టిడిపి అగ్ర నాయకులు కానరావడం లేదు. తాజాగా ఎమ్మెల్యే పాల్గొన్న కార్యక్రమంలోనూ అదే పరిస్థితి నెలకొంది. మొన్న కుమిలిలో జరిగిన పల్లె పండగ కార్యక్రమానికి రాష్ట్ర మార్కెఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారాజు హాజరైనా మండల టిడిపి నాయకత్వం హాజరు కాలేదు. మండల నేతలంతా సమావేశం కూడా నిర్వహించుకొని ఆమె కార్యాక్రమాలకు హాజరవకూడదని నిర్ణయించినట్లు బోగట్టా. ఎమ్మెల్యే నాగమాధవి మండల టిడిపిని కనీసం పట్టించుకోవడం లేదని తెలుస్తుంది. మండలంలో ఏ కార్యక్రమం జరిగినా మండల టిడిపికి సమాచారం ఇవ్వడం లేదని, దీనిపై పలుమార్లు అధిష్టానానికి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో హాజరు కావడం లేదని నాయకులు చెబుతున్నారు. ఈ విషయం ఎమ్మెల్యేకు తెలిసినా పట్టించుకోవడం లేదన్న వాదన కూడా వినిపిస్తోంది.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాధవి

సంతకవిటి: పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో శనివారం టిడిపి సీనియర్ నాయకులు గట్టి రఘుబాబు, టిడిపి మండల అధ్యక్షులు గట్టి భాను పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామాలలో రోడ్లు, తాగునీరు, సాగునీరు, పారిశుధ్య సమస్యలు పరిష్కరించేందుకు ఈ పల్లె పండుగ వారోత్సవాలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు.

బొండపల్లి : పల్లెపండగతో గ్రామాలు అభివృద్ధి బాట పడతాయని ఇఒపిఆర్‌డి ఎ.రఘుపతిరావు అన్నారు. మండలంలోని మరువాడ కొత్తవలస, దేవుపల్లి గ్రామాలలో శనివారం పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచులు కర్రోతు శ్రీనివాసరావు, గంద్రేటి రవణమ్మ వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఎఇ పి.అప్పలనాయుడు, ఎపిఒ బి.కృష్ణవేణి, మాజీ వైస్ ఎంపిపి రాపాక అచ్చెన్నాయుడు, పంచాయతీ కార్యదర్శి వి.సత్యవతి పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన


విజయనగరంకోట : మండలంలోని రాకోడు, కోరుకొండ పాలెం, పినవేమలి, గొల్లలపేటలో శనివారం నిర్వహించిన పల్లెపండగ కార్యక్రమంలో ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి పాల్గొన్నారు. ఉపాధి హామీ ద్వారా నిర్వహించే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, జొన్నవలస ఎంపిటిసి సభ్యులు రాజేష్‌బాబు, జొన్నవలసి ఎంపీటీసీ, రాకోడు ఎంపిటిసి వేచలపు శ్రీనివాసరావు, గొల్లలపేట నాయకులు సత్తిబాబు, కోరుకొండ పాలెం, పినవేమలి నాయకులు పాల్గొన్నారు.

చెరువు, రహదారి ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

కొండవెలగాడలో రియల్ ఎస్టేట్ యజమాని సీతమ్మ చెరువు, రోళ్లవాక గ్రామానికి వెళ్ళే రహదారిని ఆక్రమించి గోడ నిర్మించేశారని అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన కబ్జాకు గురైన కొండవెలగాడ సీతమ్మ చెరువు, రోళ్ళ వాక రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతమ్మ చెరువు సర్వే నెంబర్ 266, రోళ్ల వాక రహదారి (రాస్తా) సర్వే నెంబర్ 288ని రియల్ ఎస్టేట్ యజమాని ఆక్రమించుకొని అడ్డుగా గోడ కట్టేసినట్లు గుర్తించామన్నారు. కొండవెల గాడ సీతమ్మ చెరువు కొండవెలగాడతో పాటు చంద్రంపేట, తుమ్మలపేట, గరికిపేట, కొండగుంపాం, జరజాపుపేట గ్రామాల రైతులకు సాగు నీరు అందించేదని ప్రస్తుతం రియల్ ఎస్టేట్ యజమాని చెరువు ఆక్రమించుకోవడంతో సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ముఖ్యంగా కొండవెలగాడ నుంచి రోళ్లవాక గ్రామానికి రహదారిని కూడా పూర్తిగా కప్పేసి ఆక్రమించుకుని ప్రహరీ నిర్మించేశారన్నారు. దీంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయన్నారు. ఒకవేల ఏదైనా అవసరం ఉండి రోళ్ల వాక నుంచి కొండవెలగాడ రావాలంటే చుట్టూ తిరిగి చంద్రంపేట మీదుగా రావాలన్నారు. ఇలా తిరిగి రావడానికి అదనంగా మరో ఐదు కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుందని చెప్పారు. ఇంత జరుగుతున్నా స్థానిక నాయకులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. చెరువులు, ప్రభుత్వ భూములు రక్షించాల్సిన రెవెన్యూ యంత్రాంగం కూడా చోద్యం చూస్తోందని మండి పడ్డారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సీతమ్మ చెరువు, రోళ్లవాక రహదారి ఆక్రమించుకున్న రియల్ ఎస్టేట్ యజమానిపై చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అలా కాని పక్షంలో కలెక్టర్‌కి ఫిర్యాదు చేసి రైతులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



నేరాలు ఘోరాలు

బావిలో దూకి యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలోని విటి అగ్రహారం మజ్జిపేటకు చెందిన జోగ జగన్నాథం(35) కడుపునొప్పి తాళలేక శనివారం బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. జగన్నాథం ఉదయం 11 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయాడు అప్పటినుంచి కనబడక పోవడంతో భార్య రేవతి కుటుంబ సభ్యులు వెతికారు. సమీపంలోని నేల బావి ఒడ్డున ఉన్న చెప్పులు, సైకిల్ ఉండడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. రూరల్‌పోలీసులు బావిలో తేలియడుతున్న జగన్నాథం మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టంకోసం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

బాత్‌రూమ్‌లో కాలుజారి కార్మికుడు మృతి

ప్రజాశక్తి- భోగాపురం

విమానాశ్రయ నిర్మాణ సంస్థలో పనిచేస్తున్న కార్మికుడు బాత్రూం లో కాలుజారి శనివారం మృతి చెందాడు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన బ్రిడ్జ్ తుడు (36) స్నానానికి బాత్రూముకు వెళ్లి జారిపడడంతో తలకు తీవ్ర గాయమైంది. వెంటనే తగరపువలస ప్రైవేట్ ఆస్పత్రి తరలించగా మృతి చెందినట్లు అక్కడ వైద్యులు తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని మృతుడి సొంత రాష్ట్రం తరలించేందుకు విమానాశ్రయ నిర్మాణ సంస్థ ఏర్పాట్లు చేసింది.